శ్రవ్య నాటిక:

# స్వర్గానికి దారి

[రైలుస్టేషను ప్లాటుఫారం. అమ్మకపువాళ్ల కేకలూ, కూలీల అరుపులూ, ప్యాసింజర్ల ఆందోళనలూ గగ్గోలుగా వినబడుతూ ఉంటాయి.]

సుందరం: ఒరేయ్. ఈ పోర్టర్లు యిలా అంటారేం. నిన్నే బాబూ ..ఆ ముసలాయన తల జాగ్రత్త పెట్టెకొస తగిలించేవు. కూలీముఠా. విడతాడు ఒరేయ్.. టిక్కెట్లు నీ జేబులో నే వున్నాయా?., ఖాళీ యివ్వడానికి చిల్లర లేదు ఇందు అర్ధరూపాయి (గాభ్ర యాల) అదిగో. కొస్త లోపలికి రానియ్యవయ్యా గరిటా నువ్వాను కోవిడి బద్దలాగ పట్టుకున్నావు. కొంచెం జరుగు .. అమ్మయ్య ఏం ప్రయాణాలు యేం ప్రయాణాలు! రద్దీలేని రోజేలేదు తోటాకు ముడదొక్కినట్టే ఆ సెట్టిగారు ముగ్గురు పట్టే చోటు ఆక్రమించుకున్నాడు జరగమనడానికి మనకి దమ్ములున్నాయా? జరగమంటే ఆయన జరుగుతాడా? అబ్బ, నల్లులు కుడుతున్నాయి జుమ్మమంటూ దోమలు సంగీతం పాడుతున్నాయి (బిచ్చగాడు ప్రవేశించి "వీరగురుని వాక్యం, నమ్మితే వినుడు కాలజ్ఞానం, నమ్మినవారలకే మోక్షం, నమ్మకున్న నరకం" అంటూ కాలజ్ఞాన తత్వాలు పాడుతూంటాడు, తంబురా శ్రుతితో గొంతుక కలిపి)

సుం: చక్కగా పాడుతున్నాడు .. అబ్బబ్బ, గాలికే దక్కడా ఊపిరాడ్డం లేదు ఏదో దుర్వాసన. . నరకంరా బాబూ, నరకం నరకమే యింతకన్న నయమేమో చూడు ఏయ్ నిన్నే, నిద్రపోయావూ? నీయిల్లు బంగారంగానూ. కూర్చున్నావో లేదో! అసలు నుంచుని నిద్రపోయే ఘటానికి నేనూ ఓ కునుకు తీస్తా.

* * *

సుం: అయ్యా నరకానికి యిదేనా త్రోవ? ఏమండోయ్... యిక్కడెవ్వరూ బాబూ అలా చూస్తారేం? పిలిస్తే పలకరేమయ్యా? నా మాటలు వినబడటంలేదా? నా భాష తెలియదా? ఈ దారి యింత డొంక తిరుగుడుగా వుందేం? ఎక్కడది? దెయ్యాలూ, భూతాలూ దెబ్బలాడుకుంటున్నట్టున్నాయి. దెయ్యాలంటే నాకు భయం. ఇంకా భయమేమిటి నరకానికి వెడుతున్న వాడికి?......అరె! ఇంతసేపటి నుంచీ యీ గోడలు చూడనే లేదు! ఈ గోడలకి దరీ అంతూ లేనట్టుందే! నల్లగా జీమూతంలా భయం వేస్తూ యీ గోడలూ, వికారమయిన యీ తలుపూ.. బహుశా ఇదే నరకం అయివుంటుంది తలుపు కొట్టి చూస్తే సరి!.... ఏమండోయ్ తలుపు తలుపు

(లోపలినుండి): ఎవరు?

సుం తలుపు తియ్యండి

(లోపలినుండి) వస్తున్నా.

సుం: అయ్యా, తాతగారూ. నరకం యిదేనాండి?

చిత్రగుప్తుడు: ఆఁ ఇదే.

సుం మీ రెవరు?

చిత్ర: నన్ను చిత్రగుప్తుడంటారు. అయితే నువ్వెందుకిక్కడికి వచ్చావు?

## వేదుల మీనాక్షిదేవి

సుం: ఇది రూఢిగా నరకమేనా?

చిత్ర: ఆఁ. ఇది నరకమే రూఢిగా.

సుం అందుకే వచ్చానిక్కడికి వెతుక్కుంటూ. నా పాపానికి ప్రాయశ్చిత్తం కోసం

చిత్ర నీ పేరు?

సుం: సుందరం.

చిత్ర: అయితే సుందరం నువ్వు చేసిన పాపమేమిటి?

సుం: మీకు తెలియనట్టడుగుతున్నారే!

చిత్ర ఈరోజు హాజరు కావలసిన జాబితాలో నువ్వు లేవు ఈ రోజునే కాదు ఈ వారం రోజుల జాబితాలో నీ పేరు లేదు

సుం: మీరు అన్నీ చూశారే?

చిత్ర: చూడాలిటోయ్ పిచ్చివాడా? ఈ చిత్రగుప్తుడికి ఎంత అనుభవమో తెలుసా? ఆమాత్రం గుర్తులేకపోతే ఇంతకాలంనుంచీ యిలా నెగ్గుకొస్తున్నాననుకుంటావ్!. అదిసరే నీ మొహంచూస్తే దారితప్పి వచ్చినట్లు కనబడుతున్నావు నువ్వు చేసిన పాపమేమిటో చెప్పు

సుం ఆత్మహత్య ఆత్మహత్య మహాపాపం

చిత్ర: పాపమేమిటి? ఏపరిస్థితులలో ఆత్మహత్య చేసుకోవలసి వచ్చిందో.

సుం ఏపరిస్థితులలోనన్నా సరే! దేముడిచ్చిన ప్రాణాన్ని స్వంత చేతులతో తీసేసుకున్నాను చూడుతాతా. ఇవతల భార్య జబ్బుతో తూలుగుతోంది మందు లేకపోతే నామనోరమ నాకు దక్కదు. ఇంట్లో కానీ లేకపోవడం, ఆఫీసులోకి వెళ్ళి కూర్చుంటే వందలకొలది రూపాయలు లెక్కపెట్టడం! చూశావా! ఇంట్లో ఈగల మోత, బైట పల్లకీమోత చేశాను దొంగతనం చేశాను మనుకి మందిప్పించాలని

చిత్ర బ్యాంకిలో డబ్బు దొంగతనం చేశావా? దొంగతనంపాపమేఅయినా నీ పరిస్థితినిబట్టి పాపం కాదు.

సుం పోనీ డబ్బు యింటికి తెచ్చినా బాగావుండేది దొంగతనంగా పారిపోయినా బాగావుండేది అలా చెయ్యలేక పోయాను. అలవాటు లేదుగా! జేబులో వందరూపాయలు—రూపాయినోట్లకట్లతో యజమానికి పట్టుబడ్డాను ఆయన మంచివాడు కనక నామీద కేసు బనాయించకుండా ఉద్యోగంలోంచిమాత్రం బర్తరఫ్ చేశాడు(నిట్టూర్పు)

చిత్ర అదిసరే ఆత్మహత్య యిలా చేసుకున్నావ్?

సుం: అదేమన్నా కష్టమా? విషంతాగితే సరి మనోరమ అంటూండేది 'యీ దరిద్రం పడలేము విషం తేండి తాగుదా'మని మను చచ్చిపోయినా ఆమాటలు నా గుండెల్లో నిలిచాయి విషం కొనడానికి డబ్బు లేకపోతే మళ్ళీ దొంగతనం చేశాను చూశావా! నేను దొంగను ఖూనీకోరును నన్ను నమ్ముకున్న ఒక అమాయక ప్రాణిని బలి పుచ్చుకున్నాను

చిత్ర దొంగ వెలా అవుతావు? అది నువ్వు ఎవరి సొత్తు దొంగిలించావో వారిని బట్టి వుంటుంది ఏ దీనుడి జేబూ కొట్టలేదు కదా?

సుం దీనుడి జేబు కాదు. దేవుడి జేబే (నవ్వుతూ) చూశావా! దేవుడిసొమ్మే దొంగిలించాను పూజారి శఠకోపం కింద

తున్నాడు దణ్ణం పెడుతున్నట్టువంగాను పళ్లెంమీదికి. ఆరణాలు దొరికాయి. నవ్వుతావేం? దైవద్రోహిని

చిత్ర మంచి పని చేశావు అందరూ దేవుని బిడ్డలే ఆయన సొమ్ము వాడుకునేందుకు అందరికీ హక్కు వుంది ఆనాడు నువ్వు తీసుకున్నావు లేకపోతే పూజారే వాడుకుంటాడు గాని దేవుడు ఎలాగా ఆ డబ్బు తీసుకోడు

సుం నా తరఫున వకాల్తా తరవాత పుచ్చుకుందువుగాని, ముందు నా పాపానికి ప్రాయశ్చిత్తం ఏమిటో చెప్పు

చిత్ర పెద్దపాపాలేం చేశావయ్యా? ఇంతకంటె పెద్ద పాపాలు చేసినవాళ్లున్నారు అసలు పాపులెవరో తెలుసా? ముసలికాలంలో నిస్సహాయులైన తలిదండ్రులకి అన్నోదకా లివ్వకుండా బాధపెట్టేవారున్నారు ఉత్తమా యిల్లాళ్ల నుసురుపెట్టే మేటమగలున్నారు పిల్లికి బిచ్చంపెట్టక, కాకికి చెయ్యివిదపని కొసుదాసులున్నారు గురుద్రోహు లున్నారు ఆత్మభూషణా, పరదూషణాగ్రేసరు లున్నారు పరహింసే పరమలక్ష్యంగా కలవారున్నారు. నమ్మి వస్తువులు కొనుక్కునే అమాయక ప్రజల పళ్లసందున రాళ్లు, కళ్లల్లో దుమ్ముకొట్టే వ్యాపారులున్నారు ఎక్కువ సొమ్ము కంట్రాక్టు పుచ్చుకుని పేకమేడలు కట్టే ఇంజనీర్లున్నారు స్వామిద్రోహులు, మిత్రద్రోహులు, పరదార పరధనాపహారణ దురితులు, నరాల సత్తువ, కరాల బిగువు ధనికస్వాముల పరంచేసిన కూలిజనాల కడుపులు మాడ్చే కిరాతులు ఒకరా? యిద్దరా? ఎంతమంది! రకరకాల జనం యీ పుస్తకంలో పుటపుటకీ వున్నారు రాసిరాసి నా చేతు లరిగిపోతున్నాయి నువ్వు అలాంటివాడివి కావు మంచికో, చెడ్డకో గుడిలోకికూడా వెళ్లావు ఇక పాపా లెక్కడివినీకు?

సుం ఉండు అదేమిటి నీ చేతిలో? తుపాకీయా?

చిత్ర: (నవ్వుతూ) తుపాకి కాదు. ఇది యీలోకంలోని స్టెతస్కోపు అబ్బా చావంటే యెంతభయంనీకు? ఇలాంటి వాడివి ఆత్మహత్య యెలా చేసుకున్నావయ్యా?

సుం ఆత్మహత్య అంటే నాకుభయమే కాని, నా పరిస్థితులు నా వాతావరణం

చిత్ర ఇటు తిరుగు ఏదీ నీగుండె? అః గుండె వడిగా కొట్టుకుంటోంది చేసిన పాపాలు తక్కువే అయినా నీకు పశ్చాత్తాపం యెక్కువగా వుందన్నమాట నీకు విశ్రాంతి అవసరం ఒక్కమాటు కులాసాగా యీ నరకం అంతా షికారుగా తిరిగిరా. నిమ్మళిస్తుంది. మరి వెడతాను కనుంది

సుందరం: ఆవేదనతో దహించుకుపోతూంటే కులాసాట కులాసా

(నేపథ్యంలో దాహం, దాహం, కొట్టు కొట్టు, ఒకటి, ఇంకొక్కటి, మంటచెయిలో అయ్యో, బాధ అని కేకలు)

సుం అబ్బబ్బ ఏమిటి ఆక్రందనాలు? ఎవరో పాపం ఏడుస్తున్నారు

ఒక జీవుడు సుందరం, సుందరం ఇలా రా త్వరగా ఆ కర్రతీసుకుని యీ చేతిమీద రెండు కొట్టు

సుం ఎవరు నువ్వు? నీకు నాపేరెలా తెలుసు? నిన్ను యెందుకు కొట్టడం? నువ్వేం పాపం చేశావు?

జీవుడు సుందరం, నువ్వు నన్నెరగవు నిన్ను నే నెరుగుదును స్వయంగా నా చేతుల్తో నాలుగైదుసార్లు నీజేబు కత్తిరించాను అయితే యెప్పుడూ రెండుమూడు రూపాయిలుమించి నీదగ్గిర దొరకలేదు

సుం: నువ్వా మహానుభావా! ఈ లోకంలోనైనా చూడగలిగాను నిన్ను!

జీవుడు నేను చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తం లేదు లేకపోతే బ్రాహ్మణు డేమిటి? దొంగలముఠా లేమిటి? తిన్నయింటి వాసాలు లెక్కపెట్టడం యేమిటి?

సుం: నీదేదో చాలా గాథ వున్నట్టుందే!

జీ వినాలనుందా? చెబుతాను విను అడిగేవారెవరూ లేకపోయారు యీనాటి వరకూ దిక్కులేని నన్ను ఒక పుణ్యదంపతులు చేరదీసి తిండి, బట్ట యిచ్చి పెద్దవాణ్ణి చేశారు పాఠశాలలో వేశారు చదువుకి దుష్టసహవాసాలవల్ల నాకు చదువుమీద ధోరణి లేకపోయింది సిగరెట్లు, సినీమాలు అలవాటయాయి నా స్నేహితులవల్ల 'పాడైపోతావు తల్లిదండ్రులు లేనివాడవు నీ బ్రతుకుతెరువు నీకు యేర్పాటుచేద్దా మనుకుంటున్నాను' అని మందలించారు ఆయన మాటలు వింటే నాకు కోపం వచ్చేసింది వెంటనే నా స్నేహితుల దగ్గిరకి వెళ్ళిపోయాను కొన్నాళ్లు స్నేహితులతోపాటే తింటూ తిరుగుతూ వున్నాను చేతిలో దమ్మిడీ అయినాలేని నాదగ్గిర యెప్పుడూ డబ్బులు గలగలలాడుతూండేవి నా స్నేహితులు రోజూకో వస్తువు తెచ్చి అమ్మి డబ్బు సంపాదిస్తూండేవారు దానితో మేం కాలక్షేపం చేస్తూండేవాళ్లం కొన్నాళ్ళయేటప్పటికి నాకూ అలవాటయింది జేబులు సవరించడం సినీమాలవద్ద, రైలుస్టేషన్లదగ్గిర, బజార్లలోనూ, పోస్టాఫీసుప్రాంతంలోను నిలబడి జేబుదొంగతనాలు ప్రారంభించాను ఆఖరికి నగలు కత్తిరించడందాకా వచ్చింది నా ప్రావీణ్యం. నన్ను పోషించిన ఆ ధర్మదేవత యింట్లోకి ఒకనాడు చీకటివేళ దూరి, చాటున నక్కి అమ్మగారినగలు, అయ్యగారి రొఖ్ఖం పట్టుకు పారిపోయాను స్వామిద్రోహం చేశాను

సుం ఎవ్వరూ పట్టుకోలేదా? ఆయన రిపోర్టు చెయ్యలేదా?

జీవుడు నేనని ఆయనకేం తెలుసు? దొంగలుపడ్డారు అనుకున్నారు 'రెక్కలొచ్చి పోయాయి మన సొమ్మైతే వుండును' అని వూరుకున్నారు కన్నతల్లిదండ్రులకంటె యెక్కువైన ఆ మహారాజుకి, ఆ తల్లికి చేసిన ద్రోహమే నన్ను కట్టి కుడుపుతోంది ఆ పాపం చేసిన చేతులకు యిదే శిక్ష. త్వరగా కొట్టు లాఠీ యిక్కడే వుంది

సుం అబ్బ దెబ్బలతో వాచిపోయి, కమిలి, రక్తం చిమ్ముతున్న యీ చేతుల మీద యెలా కొట్టడం?

జీవుడు కొట్టవయ్యా నీ కెందుకా గొడవ?

సుం ఎండనున్నవాడికి గాని నీడ సుఖం తెలియదు ఈ చేతిమీద దెబ్బలతో యిదే బాగుంది నీకు దెబ్బలు లేకుండా రెండు రోజు లుండు మళ్ళీ దెబ్బ పడగలవేమో చూస్తా, ఇదిగో యీ లాఠీ విరిచి పారేస్తున్నా

జీ (ఆత్రుతగా) విరవకు సుందరం విరిచేశావా? అయ్యో, అయ్యో (పడిపోతాడు)

సుం ఇదేమిట లాఠీ విరిచిపారేయడం ముప్పొచ్చిందే! ఈ వ్యక్తి మరణించాడు. నా కాళ్లు ఒణుకుతున్నాయి

(దాహం, దాహం అని కేకలు వినబడతాయి)

సుం ఇక్కడికి రావడం, వీడిని చంపడం అయింది ఎవరో దాహం అంటున్నారు వెళ్ళి కాసిన నీళ్లు గొంతుకలోపోసి దప్పి తీరుస్తాను

మరొక జీవుడు దాహమేస్తోంది ఎవరూ పలకరేమయ్యా? ముసలాడెక్కడచచ్చాడు?

సుం దాహమా నాయనా?

జీ తరవాత పరామర్శిద్దువుగాని ముందు కాసిని వుప్పనీళ్లు గొంతుకలో పొయ్యి

సుం ఉప్పనీళ్లెందుకు తాగుతావు? నువ్వే పాపంవల్ల యిక్కడ వున్నావో చెబుతావా?

జీ చెప్పకేమయ్యా అడిగినవా డున్నప్పుడు? నేనొక బీదబ్రాహ్మణ్ణి చదువు సున్న భుక్తికోసమని పెళ్లిళ్లలో నీళ్లుమొయ్యడం, విస్తళ్లు తియ్యటంవంటి పనులుచేసేవాడిని కుళాయిలు యింట్లో లేని గృహస్థుల

# ★ స్వర్గానికి దారి ★

ఘుళ్లలో మంచినీళ్లు పోసేవాడిని. పాఠశాలలలో విద్యార్థులకు నీళ్ళుపోసేవాడిని వీధికుళాయిలు ఖాళీగా వుండేవికావు మా వూరంతకీ నాలుగైదు చెరువులున్నాయి ఎక్కడికి చెరువుదగ్గరగా వుంటే ఆ చెరువులో నీళ్ళు తెచ్చిపోసేవాణ్ణి నలకలుంటే అనుమానపడతారని నేను పైనవేసుకునే అంగవస్త్రంతో వడపోసేవాణ్ణి అందరికీ ఆ నీళ్లేగాని ఒక్కవాడూ కుళాయిదగ్గర నిలబడి బిందెడు నీళ్ళు పోసిన పాపాన పోలేదు

సుందరం ఏదో కుళాయిలున్నాయి కనక అనుకుంటున్నాంగాని పల్లెటూళ్లలో చెరువులు, కాలవలు, నూతులువుంటే ఆ నీరే వుపయోగిస్తారు జనం అదొక పాపమేమిటి

జీ. ఊళ్లో యెవ్వరూ ఆ చెరువులలో నీళ్లు తాగరు ఓ పక్కని చాకళ్లు బట్టలుతుకుతూంటారు పశువులను కడుగుతూంటారు ఓమూలనుంచి కుక్కలు తాగుతూంటాయి రోగిష్టివాళ్లైన ముష్టివాళ్లు ఆ చెరువుదగ్గిరే మకాం అందులో నీళ్లోసుకోడం, తిన్నగిన్నెలు కడగడం చేస్తూంటారు పరిశుభ్రమైన నీళ్లు త్రాగేవారిని మోసపుచ్చి అశుద్ధమైన నీళ్లు తాగించాను. (నిట్టూర్పు)

సుం పోనీ నువ్విచ్చావనుకో వాళ్లకి కుళాయినీళ్లకి వీటికి భేదం తెలియలేదా? అనుమానమైనా లేకపోయిందా?

జీ నాయనా అనుకోవడంలోవుంటుంది కుళాయినీళ్లే అనుకుంటే బాగానే వుంటాయి కాదు అనుకుంటే కాని భేదం వున్నట్లు తోచదు అక్కడికీ ఒకొక్కప్పుడు నీళ్లు వాసనగా వుంటున్నాయేం అంటే మందులేవో కలిపినట్లున్నారు అనేవాడిని ఆ ఖర్మంవల్ల యిక్కడ నిత్యం దాహం అడిగినప్పుడల్లా ఉప్పునీళ్లు పోస్తూంటారు

సుం ఉప్పునీళ్ళతో నీకు దాహం యెల్లా తీరుతుంది? మంచినీళ్లు పోస్తాను

జీ వద్దు వద్దు ఉప్పునీళ్ళే కావాలి

సుం దాహం తీరదు నాయనా నా చేతులతో నేను ఉప్పునీళ్లు పొయ్యలేను. చల్లని నీళ్లివిగో తాగు

జీ వద్దు వద్దు ఉప్పునీళ్లే కావాలి

సుం సరే ఉప్పునీళ్లే తాగు. (గొంతుకలో పోస్తాడు)

జీ ఉప్పునీళ్లని చెప్పి మంచినీళ్లు పోశావా! గొంతుక కాలిపోతోంది, దుర్మార్గుడా!.. (పడిపోతాడు).

సుం అయ్యో అయ్యో, మంచినీళ్లే పంతులూ! అలా విరుచుకుపడ్డావేం? చచ్చిపోయాడు! ఇంకేం మాట్లాడుతాడు! హుం ఎక్కడికి వెళ్ళినా హంతకుణ్ణి అవుతున్నాను అతనడిగినట్లు ఉప్పునీళ్లే పోస్తే తీరిపోను నాకు పాపం లేకపోను దుష్టగ్రహపీడ యీ లోకంలోనూ నన్ను వెంటాడుతూనే వుంది లేకపోతే యేమిటీ హత్యలు! ఆ లోకంలో ఒకటి! ఈ లోకంలో రెండు! మొత్తం మూడా! యింకా ఎన్నో!

[నేపథ్యంలో ఒక్కటి ఇంకొక్కటి అని వినబడుతుంది]

సుం ఏంకావాలి మీకు? మీమీద నిలువెత్తున యీ యిటుకలు పేర్చివున్నాయేం? ఎలా మాట్లాడగలుగుతున్నారు యీ బరువుతో?

ఇం. జీ నా బరువుగోడవ నీకెందుకు? పేర్చు అన్నప్పుడల్లా ఒకటి, రెండు చొప్పున యిటికలు పేరుస్తూవుండు అదే నాకు కావాలి

సుం: నీ కోర్కె దారుణంగా వుంది

జీ కోర్కె కాదు అదే అలవాటయిపోయింది యిక్కడ

సుం ఏ కారణంచేత యిలా వున్నావో చెబుతావా?

జీ అయితే చెబుతా విను నేనొక వైశ్యకుటుంబంలో పుట్టాను తాతముత్తాతల పద్ధతిలో నేనూ మా కిరాణా కొట్లో వ్యాపారం ప్రారంభించాను అంతలో రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది ధరలు పెరిగాయి సరుకులు తగ్గాయి తగ్గిన సరుకులను, రేషన్ వస్తువులను బ్లాక్‌మార్కెట్టులో అమ్మి లక్షలార్జించాను తాకట్లు పట్టాను తిరణాలు పట్టాను పట్టాణంటే అవి మనకి భుక్తం అయాయన్నమాటే! మళ్ళీ వాళ్ళ స్వాధీనం కాకుండా ములగనిచ్చేవాడిని 'తొందరలేదు. మరోసారి తీర్చుకోండి' అని చిలర దొరకనిరోజులలో బస్తాలతో చిల్లరకట్టి అటకమీద జాగ్రత్త పెట్టాను రూపాయికి రెండణాలు మారకం పుచ్చుకునేవాడిని రేషన్‌బియ్యంలో రాళ్లు, ఒళ్లు కలిపి అమ్మేవాణ్ణి మంచివస్తువు చూపించి నాసివస్తువు యిచ్చేవాణ్ణి ఎక్కడే సరుకు లేకపోయినా నాదగ్గరకు రావలసిందే ఒక బట్టలకొట్టు మామూలు నేతబట్టలతో పెట్టి రాత్రివేళ కంట్రోల్ బట్టలు చీకటిబజారులో రెట్టింపు ధరలైతే మూడురెట్లు ధరకు అమ్మేవాణ్ణి. కుళ్లినూనె, కంపుకొయ్యేకాని ఒక్కనాడు గుమగుమలాడేవి యివ్వలేదు తప్పుకూ కొలు

ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేదీ, ఏ క్షణం ఎలా ఉండేదీ తెలియని ఈదినాలో
అగ్ని * మోటార్‌కార్ * కార్మిక నష్టపరిహారం
నౌక * ఫయిడిలిటీ గ్యారంటీ * మొదలైన భీమాలకు
మాతో సంప్రదించండి:

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జనరల్ ఇన్సురెన్సు కంపెని లిమిటెడ్,
'యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు"
ఎస్ప్లనేడ్ - మద్రాసు

Telephone : 4241 Telegrams : "UNIGEN"

బ్రాంచీలు
బొంబాయి - కలకత్తా - కొలంబో - సింగపూరు విజయవాడ -
ఢిల్లీ - పాట్న - లక్నో - బెంగుళూరు - కోయంబత్తూరు

తూచాను. ఎంతమందికో ఆశ్రయం లేకుండా వాళ్లయిళ్లు స్వాధీనం చేసుకున్నాను. ఎందరికో ముష్టికి చెంబుకూడా లేకుండా సొమ్మంతా దఖలుపరుచుకున్నాను.

సుం: కంట్రోలు వస్తువులు అమ్మావు కదా? పోలీసులు పట్టుకోలేదా?

జీ: గోడవరాకుండా వాళ్ల చేతులు తడిచేసి వాళ్లని స్వాధీనం చేసుకున్నాను. దానికేంగాని, ప్రజలసొమ్ము స్వాధీనం చేసుకోవడంలో ఒకమారు జరిగిన సంగతి వింటే నువ్వు తిట్టక మానవు!

సుం: ఏం జరిగిం దేమిటి?

జీ: ఒకనాడు డెబ్బైయేళ్ల ముసిలి ముత్తైదువ వచ్చింది.

*  *  *

ముసిల్ది: బాబయ్యా?

సెట్టి: ఎవరికోసం?

ముసి: తమకోసమే. మాట్లాడే పనుంది బాబూ.

సె: నీపేరేవరు? ఏ కులం?

ముసి: నా పేరు మాలచ్చిమండి. కాపులం. యవసాయం చేసుకు బతుకుతున్నాం.

సె: నువ్వు వచ్చిన పనేమిటి?

ముసి: అదే చెబుతున్నానండి, మా గాహచారపు రోజులుచేత ఓ యెద్దు సచ్చిపోయిందండి. మరో యెద్దుని కొంటేకాని పని జరగదండి. పంటలేకపోతే మలమల మాడి సవ్వాలండి, సామీ. తమరు ఒక నూరురూపాయలు సర్దుబాటు చేయిస్తే యీలాయినంత పెందలకాడే తీర్చేస్తా బాబూ.

సె: ఏం చూసుకుని యిమ్మంటావ్ వంద రూపాయలు? ఏదైనా బంగారం వస్తువు తాకట్టు పెడితే కాని యివ్వను.

ము: పిట్టనికొట్ట పొయ్యిలో పెట్ట, రెక్కాడితే కాని డొక్కాడదు... మాకు వగలెక్కడివి? నా మెళ్లో శతమానాలు నాలుగు కాసులవిపున్నాయి. అవి మీ కాడ యెడతాను. మెళ్లో పసుపుకొమ్ము కట్టుకుంటాను. అవసరమొస్తుందని పసుపుకొమ్ము కట్టిన బొందుకూడా తెచ్చుకున్నానండి. అవసరం వచ్చినప్పుడేం చేత్తాం మరి.

సె: ఏవీ ఇలా తే......ఇవి బంగారంవేనా?

ము: అదేంటి మాబాబులు అలా సెలవిత్తారు? నా పెళ్లికి రాణీకాలుసు కొని చేయించినవి. ఆనాటికీ యీనాటికీ అరగలేదు. మెరుపు తగ్గలేదండి.

సె: అయితే సరేలే ఇదిగో వందరూపాయలు. పట్టికెళ్లు. తీర్చడానికేమంత హడావిడి లేదులే.

ము: చిత్తం. తమవంటి ఖామందు లుండబట్టే మాలాంటి పేదోళ్లం బతగ్గలుగుతున్నాం. వెళ్లొస్తాను బాబూ.

*  *  *

జీ: అంటూ ముసిల్ది వెళ్ళిపోయింది.

సుం: పాపం. మంగళసూత్రాలు కూడాను, ఆ అవ్వ తాకట్టు విడిపించుకుందా?

జీ: సొమ్ము పట్టికెళ్ళిన ఆరునెల్లకల్లా వచ్చింది. నేను గల్లాపెట్టిదగ్గిర కూర్చుని పద్దులు చూసుకుంటున్నాను.

*  *  *

ముసి: బాబయ్యా, దణ్ణాలు.

సె: ఏం యిలా వచ్చావు?

ముసి: మీ దయవల్ల యెద్దు కొనుక్కున్నాం. పంటతాలూకు సొమ్మందింది. ఇదిగో మీరిచ్చిన నూరురూపాయలు, నా శతమానా లిప్పించండి.

సె: (అదిరిపడి) ఏమిటే! శతమానాలా! నూరురూపాయ లిచ్చానా! ఎవరి నడుగుతున్నావ్! ఎవరి యిల్లనుకుని వచ్చావో! పెద్దతనం!

ముసి: పరాశికంమాట లేంటి బాబూ! మీబోటి ఖామందు లుండబట్టే మాలాంటి బీదోళ్లం యిబ్బందివత్తే ముందూ వెనకా సర్దుకుంటున్నాం. దయసేయించండి నా శతమానాలు. ఎంత పెద్దదాన్నయినా మీ లోగిలి బాకు గుర్తే.

సె: నిజంగా చెబుతున్నాను. నాకేమీ యీ గొడవే తెలియదు.

ముసి: ఓలమ్మోయ్. ఏదో పూరికే అంటున్నారనుకున్నాను బాబోయ్. ఆ మాయదారి యెద్దుచావమట్టి యిన్ని తిప్పలొచ్చాయి. సాయం మాకొరాఅమ్మల్లారా! అయ్యల్లారా! నాలుగు కాసుల సొమ్ము యేసుకుందామని మూస్తున్నాడు! తాకట్టెట్టిన నా శతమానాలు యెరగనంటున్నాడు!


సె: ఏమిటే పాడుగొడవ? నీదిక్కున్నచోట చెప్పుకో (ధడీమని తలుపు వేసుకుపోతాడు)

ముసి: పాడుగొడవ నాదికాదు. నీదే పాడుగొడవ. నీయిల్లు పాడుయిల్లు. నీవ్యాపారం పాడువ్యాపారం. అయ్యో నా శతమానాలో (గుండె బాదుకుని యేడుస్తుంది)

*  *  *

జీ: ఏడుస్తూ వెళ్ళిపోయింది.

సుం: పోనీ అంత యేడ్చినప్పుడైనా

జాలి లేకపోయిందా నీకు? పాపభీతైనా లేకపోయిందా?

జీ: నా రాతిగుండెలు కరగలేదు. పాపభీతి యేనాడూ లేదు. ముసిలిదాని శాపం తగిలింది. ఆరునెలలు తిరక్కుండా ఒక్కగా నొక్క కూతురు మహాలక్ష్మిలాంటి కూతురు మూలపడింది. ముసిలిదాని శతమూ నా లిచ్చెయ్యమని నా భార్య బ్రతిమాలింది. నే నొప్పుకోలేదు. మరో రెండునెల్లకల్లా షికారు వెళ్లివస్తూ కారుకిందపడి చనిపోయాను. నా భార్య అమాయకురాలు. ఎలా బ్రతుకుతుందో! నా భార్యమెళ్లో, నా బిడ్డ మెళ్ళో మంగళసూత్రాలు దేవు డెత్తుకుపోయాడు. ముసిలిదాని శాపం తగిలింది. దాని పెనిమిటి నిక్షేపంలాగ వున్నాడిప్పుడుకూడా! ఇది ఒక్క సంఘటన సుమా! ఇంకా యిలాంటివి యెన్నో!!!

సుం: ఎంత ఘోరమైన పని చేశావు! నువ్వు మనిషివి కావు. మానవరక్తాన్ని పీల్చే రాక్షసివి. (పటపట పళ్లు కొరుకుతాడు)

జీ: నేను చెప్పలేదూ వింటే నువ్వు నన్ను తిడతావని? ఆ సంగతి సరే. సాటి మానవుణ్ణి గౌరవించడం మానేశాను. ముఖమెత్తి మాట్లాడకుండా చీదరించుకుంటూ డబ్బుపుచ్చుకుని కావలసిన వస్తువులిచ్చేవాడిని. వాళ్ళ డబ్బువల్లే నే నింతవాణ్ణయానన్న సంగతే మరిచిపోయాను. ఎన్నడూ కాణీ యెంగిలిచెయ్యి విదపలేదు. ఒక్క యెర్రని యేగానీ దానం చెయ్యలేదు. గుప్పెడు బియ్యం ముష్టి వెయ్యలేదు. లాభాలమీద లాభాలు పొందాను. మేడలమీద మేడలు కట్టాను. అక్కడ నవ్వుతూ చేసిన దానిఫలితం యిదిగో యిక్కడ అనుభవిస్తున్నాను యేడుస్తూ.

సుం: అయ్యయ్యో, యెంతెంత అన్యాయాలు చేశావు! లాభాలు పుచ్చుకోవడంలోనూ వున్నవాళ్ళు లేనివాళ్ళు అని లేడా లేదా? కుడీ, యెడమ వుండొద్దా? ఆకలితో అటమటించిపోతూ వాళ్లు నిలవనీడ లేక అల్లాడిపోతుంటే హాయిగా మేడమీదకూర్చుని భోగాలనుభవిస్తూ మూటలు కట్టావా! నీ ప్రాణం యెలా ఒప్పింది!

జీ: నాచరిత్ర తెలుసుకుని నిన్ను అభిప్రాయం చెప్పమనలేదు. నాలుగుయిటికలు పేర్చు. అక్కడ లాభాలమీద లాభాలు, ఇక్కడ ఇటికలమీద ఇటికలు. త్వరగా పేర్చు.

సుం: నువ్వైతే యెలాంటిపనైనా చెయ్యకలవుగాని నేను చెయ్యలేను. అసలే బరువుతో క్రుంగిపోతున్న నీమీద యింకా బరువు పెట్టలేను. నాలుగు యిటికలుతీస్తే కాస్త బరువు తగ్గవచ్చు (తీస్తాడు)

జీ: వద్దువద్దు. తియ్యవద్దు. అదిగో వద్దంటుంటే తీసేశావా? అయ్యో, అయ్యో, (పడిపోతాడు)

సుం: ఈ జీవుడూ చచ్చిపోయాడు. నాకు మతిపోతోంది హత్యలమీద హత్యలు ...(బాగ, మంటలు వెయ్యండి అని కేకలు) అదిగో కోలాహలం. భూలోకమంతా యిక్కడే వున్నట్టుంది. ప్రతీవాడి దగ్గరకీ వెడతాను. ప్రతీవాణ్ణీ చంపుతాను. ఇవ్వాళ నరకంలోవున్న జీవుల యాతనలకి ఆఖరిరోజు. రేపటినుండి నరకం నిర్జనం. యమధర్మరాజుని, చిత్రగుప్తుణ్ణి యేలుకోమనీ యెడారి. (మళ్ళీ అరుపులు వినబడతాయి) వస్తున్నా. మీకోసమే వస్తున్నా (వెళ్లబోవును.)

అపరిచిత వ్యక్తి: ఎక్కడికి? ఆగు. (గంభీరమైన కంఠస్వరంతో)

సుం: ఎవరది! తాతా యిక్కడే వున్నావా! ఈయ నెవరు?

చిత్రగుప్తుడు: (నవ్వుతూ) ధర్మపీఠం మీద కూర్చుని జీవులుచేసే పాపపుణ్యాలను విచారించి న్యాయమైన తీర్పుల నిచ్చే ధర్మదేవత. యమధర్మరాజంటారీయన్ని.

సుం: యమధర్మరాజా పేరు చెబితే నే భయం వేసేటట్లు నల్లగా అంజన పర్వతంలా కోరమీసాలతో, భయంకరమైన ముఖంతో, చింతనిప్పులవంటి కళ్ళతో, రక్తపు రంగు గల పెదిమలు, నాలిక గలిగి కర్కశమైన కంఠస్వరంతో వుంటాడని యీయన రూపు వర్ణిస్తారు కదా! ఈ మహాపురుషుడు ఎంత ప్రసన్నంగా వున్నాడో! ధర్మదేవతా నమస్కారం.

యమ: దీర్ఘాయుష్మాన్ భవ. నువ్వు విన్న వర్ణన నిజమే. భయంకరరూపం పాపులకు కనబడుతుంది. అసలు నారూపు పుణ్యాత్ములకు గాని కనబడదు. నువ్వు పుణ్యాత్ముడివి కనుక నా ప్రసన్నమైన రూపాన్ని చూడగలిగావు.

చిత్ర: నేను చెప్పలేదూ నువ్వు పాపివి కావని? నామాట యిప్పుడైనా నమ్ముతావా? నీ పరిస్థితులనుబట్టి ఆత్మహత్య పాపం కాకపోయినా క్రూరకర్మ చేశావు కనుక యీ లోకంలో కొంతకాలం వుండడం, నరకయాతనలు చూడడం జరిగింది. నాటివల్ల నీమనస్సు క్షోభపడింది ఇదే నీకు శిక్ష. నీ శిక్ష అనుభవించేశావు ఇక నువ్వీలోకంలో వుండక్కర్లేదు. తిన్నగా యీదిక్కుగా వెళ్లు, ఆ యెదర కనబడేదే స్వర్గం. హాయిగా స్వర్గసౌఖ్యాలనుభవించు.

సుం: ఆఁ? ఆఁ? నాశిక్షఅయిపోయిందా? ఏడీ ధర్ముడు!

చిత్ర: ఆయన నీకు దర్శనమివ్వడానికి వచ్చాడు. అదృశ్యుడైపోయాడు.

సుం: తాతా, నమస్కారం. వెడుతున్నాను. సెలవు.

చిత్ర: మంచిది.

సుం: స్వర్గానికి దారేది బాబూ?...... ......బాబూ యిలాగేనా?............. .........పుణ్యాత్ములకి పుష్పకవిమానం వస్తుందంటారు! రాదేం నాకు! ....... కాయనా, యిదేనా దారి స్వర్గానికి?

* * *

ప్రయాణీకుడు: అదేమిటల్లా పలవరిస్తారు? ఎక్కడ దిగుతారుసార్?


సుం: స్వర్గంలో.

ప్రయా: ఏమండోయ్. మిమ్మల్నే. ఎక్కడ దిగుతారు?

సుం: ఆఁ! నేనా! ఆఁ! ఆఁ!... బెజవాడలో.

ప్రయా: బెజవాడదాటి గంటయిందయ్యా! బలే నిద్రే!

సుం: అయ్యో, అయ్యో, దాటిపోయిందా? దాటిపోయిందా? ★



లల్లూరాం అండ్ కో
స్థాపితము 1928.
ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాషు బాక్సులు
లల్లూరాం అండ్ కో
వెలగలేటివారి వీధి, : : విజయవాడ - 1.
"కొత్త షోరూమ్ - మారుతి సినిమా కెదురుగా."